


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**మీ మునిమనవడు** ఆ కబురు చెప్పాడా మీర్ సాబ్! చాలా సంతోషకరమైన వార్త" అంటూ ఠక్కున సైలెంటైపోయాడు ఖురేషీ.

"ఏం.. ఆగిపోయావూ?" అడిగింది హుస్నా.

"అమ్మా.. మీర్‌గారు మునిమనవడి కొడుకు జన్మతో ఓ అశుభం కూడా జరుగుతుందని చెప్పారు" తలవొంచుకుని అన్నాడు ఖురేషి.

"అదా! అది సహజమేకదా ఖురేషీ. దానికి కంగారెందుకూ. నూట ముప్పై అయిదేళ్ళ జీవితాన్ని దివ్యంగా అనుభవించాను. బిడ్డల్ని కనిపెంచి ప్రయోజకుల్ని చేశాను. ఈ దేహంతో చెయ్యాల్సిన పనులేవీ మిగల్లేదు బద్రూ.! ఎక్కడినించి వచ్చామో అక్కడికి పోవడమే జీవుల ధర్మం. జనన మరణాల చక్రంకదులుతూనే వుంటుందిగా" స్నేహపూర్వకంగా బద్రుద్దీన్ ఖురేషీ భుజం మీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు హుంజా మీర్.

"అవునన్నయ్యా.. ఆయన అన్నది సరైనమాట. తృప్తిగా జీవించాం. తృప్తితో వెళ్ళిపోవడమే మిగిలింది" తనూ అనునయంగా అన్నది ముస్నామీర్.

"అవునూ.. ఇంతకీ ఎవరూ కబురు పంపిందీ. మీ ముని మనవడు ఇక్కడలేడుగా!" అన్నాడు ఖురేషీ.

"నా కొడుకు భారతదేశం వెళ్ళే ఎనభై ఏళ్ళయింది. వాడికొడుకు ఇక్కడికి అనేకసార్లు వచ్చాడు" నవ్వాడు ఇసాక్ అల్ హుంజామీర్.

"మరి కబురు ఎలా అందిందీ?"

"నే చెప్పానుగా నాకు కలలో ఒకరు కనిపిస్తాడనీ! అతను చెప్పాడు. నీ వంశంలో 143 వ సంతానం జన్మనెత్తబోతోందని" మీర్ సాహెబ్ కళ్ళు ఆనందంతో ప్రకాశించాయి.

"కలా! మీర్ సాబ్.. కలలు కొన్ని నిజమవ్వొచ్చు కానీ, అన్నీ నిజం కావు. ఎవరో కలలోకి రావడం, చెప్పడం విషయం నేను నమ్ముతాను. ఎందుకంటే నాకు తెలిసి చీమకైనా మీ దంపతులు అపకారం చెయ్యలేదు. చెయ్యరు. కానీ, లోకం నమ్మదు. నా వరకూ నేను దేవుడ్ని ప్రార్ధిస్తాను. మీకల అబద్ధం కావాలనీ, మీరు సుఖంగా మరో వందేళ్ళు జీవించాలనీ" లేచి బయటికి నడిచాడు ఖురేషి.

"చూశావా హుస్నా... ఖురేషీకి మనమంటే ఎంత ప్రేమో. ఏదేమైనా నా కల అసత్యంకాదు" బద్రుద్దీన్ ఖురేషీ వైపే చూస్తూ అన్నాడు మీర్ సాబ్. మళ్ళీ ఈ కల కథ వూరూ వేలీ అంతా ఆక్రమించింది. విషయం ఏమంటే ఈ విషయాన్ని బద్రుద్దీన్ తన భార్యకి చెప్పడం. ఆవిడ తన ఫ్రెండ్స్‌కి చెప్పడం. బద్రుద్దీన్‌లో పాపం బాధ తప్ప మరేదీలేదు. కానీ జనాలు ఎగతాళిగా మాట్లాడుకోవడం మొదలెట్టారు. అందరికీ మీర్ సాబ్ అంటే గౌరవమూ భక్తీ. కానీ ఆ గౌరవం వెనుక కొందరికి అసూయ వుంటుంది. పైకి చాలా గౌరవం చూపే వాళ్ళ మనసులోకి తొంగి చూస్తే అక్కడ మనకి ఎన్నో సంధర్భాల్లో కనిపించేది అసూయ. ఆ అసూయకూడా సమయం కోసం వేచి చూసే అసూయ. ఇప్పుడా అసూయ ఎగతాళిగానూ, ఎకసెక్కింగానూ బయటపడింది. ఇసాక్ అల్ హుంజా మీర్ చాలా ఎక్కువ. అయితే అందులో చాలామంది ఇతర దేశాలకి తరలి వెళ్ళారు. వేలీలో ఇప్పటికీ కలిసి వున్న పెద్ద కుటుంబం మీర్ సాబ్‌దే.

ఈ ఎకసెక్కాలు, ఎగతాళులూ మీర్ సాబ్ పిల్లల చెవుల్లో కూడా పడింది.

"అమ్మా.. నాన్న ఎందుకు అలా అందరికీ చెప్పారు" కొంచెం బాధగా అడిగింది పెద్ద కూతురు ఫాతిమా ముస్నా మీర్‌ని.

"నువ్వు విన్న మాటలు నాదాకా కూడా వచ్చాయి బేటీ. మీ నాన్న వెన్నెలంత స్వచ్ఛమైన వాడని నీకూ తెలుసు. 'దాచే' గుణం ఆయనలో లేదు. పాపం బద్రూ కూడా అమాయకంగా అతని భార్యకి చెప్పాడు. ఒక్కటి మాత్రం నిజం ఫాతిమా.. కలలో ఆయన విన్నది నిజం" అన్నది ముస్నా.

"అంటే?" షాక్‌తో అన్నది ఫాతిమా.

"ఆ బిడ్డ జన్మకీ మా మృత్యువుకీ సంబంధం వుంది" నిర్లిప్తంగా అన్నది ముస్నా మీర్.

"నేను ముమ్మాటికీ నమ్మను" మొండిగా అన్నది ఫాతిమా.

"అల్లా జానే" చిన్నగా అన్నది హుస్నా.. టీ కలుపుతూ.

"తుఫాను వస్తుందని అనుకున్నాం. వెర్రిగాలులు కొన్ని వీచినై. మబ్బులూ ఆకాశంలో కమ్మినై. మెరుపులూ కొన్ని మెరిసినై. పిడుగులు మాత్రం పడలేదు. వర్షమూ రాలేదు. అంతేగదా శాస్త్రిగారూ!" అన్నాడు డాక్టర్ టి.వి.ఎన్. అంటే తిరువీధి నారాయణాచార్యులు. వృత్తి రీత్యా వైద్యుడు. ప్రవృత్తి రీత్యా రచయిత, ఆధ్యాత్మిక వేత్త.

"హ...హ.. ఉన్న పరిస్థితిని అద్భుతమైన మాటల్లో చెప్పారు డాక్టరుగారూ. వాతావరణ శాఖ వానరాకనీ తుఫాను రాకనీ ముందే లెక్కలు కట్టి చెబుతుంది. కానీ వారి అంచనాలు ఘోరంగా దెబ్బతిన్న సంఘటనలు చాలా వున్నాయి. ఇంకో విషయం తెలుసా? ఉరుములు ఉరుములై, మెరుపులు మెరుస్తాయి, పిడుగులు భయంకరంగా పడతై. కానీ డాక్టర్ కొన్ని పిడుగులు నిశ్శబ్దంగా పడి భయంకరమైన నష్టాల్ని కలిగిస్తాయి. వాటినే చలిపిడుగులు అంటారు" చిన్నగా అన్నారు శాస్త్రిగారు.

"ఈ పదం వినలేదే" అన్నాడు శృంగి.

"కాలగర్భంలో కలిసిపోయిన అనేక పదాల్లో ఇది ఒకటి. పిడుగుపడితే చెట్లూ, ఇళ్ళూ కూలిపోయినట్లు ఒక్కోసారి మంచుకూడా ఓ విస్ఫోటనంతో కూలిపోయి నీరు వరద కడుతుంది. అక్కడ కూడా యీ 'చలిపిడుగు' పదాన్నే ఉపయోగిస్తారు. భూగోళమే వెర్రెత్తినట్టు మానవుడి చేష్టలవలన వేడెక్కుతోంది. భవిష్యత్తులో వచ్చే ఉత్పాతాలకి ఏం పేర్లు పెట్టాలో ఏమిటో" అన్నాడు రామజోగి.

"ప్రస్తుత పరిస్థితిని ఎలా అంచనా వెయ్యాలీ?" అడిగారు. డాకర్ టివిఎన్. అతని కుతూహలం అతనిదీ. ఈ సంఘటనలన్నిటినీ ఓ మాలగా కూర్చి ఓ నవల వ్రాయాలన్నది డాక్టర్ టి.వి.ఎన్ మనసులో కదలాడుతున్న కోరిక.

"రాబీ, జయ్, శ్రీనివాస్, నేనూ రామజోగీ, యజ్ఞప్ప, మదాలస అందరం ఒక అస్పష్టమైన పరిస్థితిలో కలిశాం. మనతోపాటు శృంగి, మట్టులే కాక మహాశాంతి యజ్ఞం నిర్వహించిన మహానుభావులెందరో వున్నారు. మీరూ యీ సమావేశంలో భాగస్తులే. శరద్వతి, శ్రీనివాస్‌ల తల్లిగారూ సాక్షులు. వారి పరోక్ష పాత్ర ఎంతో నిర్ణయించేది కాలం మాత్రమే" ఆగారు శాస్త్రిగారు. అందరూ వింటున్నారు. అందరూ అంటే, శృంగీ, మట్టూ, రామజోగి, డాక్టర్ టి.వి.ఎన్ గారి భార్య విమల సుందరీ.

"అందరం ఎందుకో అందుకు కలిశాం. మళ్ళీ మనలోంచి కొందరు వారి వారి స్వస్థానాలకు తరలిపోయారు." ఓ నిట్టూర్పు విడిచి అన్నారు శాస్త్రిగారు.

"కింకర్తవ్యం?" అన్నారు డాక్టరుగారు.

"అయ్యా... నాదొక మనవి" అన్నాడు శృంగి.

"చెప్పనాయనా" అన్నారు శాస్త్రిగారు.

"తక్షపురం వెళ్ళి ఆ సర్పశిలా మండపాన్ని చూడాలని ఉంది. ఎందుకంటే జనమేజయుడు సర్పయాగం మొదలెట్టింది మహాభారతానికీ సంబంధం ఉండొచ్చూ, ఉండకపోవచ్చు. మహాభారత యుద్ధానంతరం మాత్రం ఖచ్చితమైన సంబంధం వుండేవుంటుంది" అన్నాడు శృంగి.

"అదీ నిజమే స్వామీ. శృంగి చెప్పిందీ ఆలోచించదగినదే. ఆ మండపంలోని శిలా సర్పమే ఈ పరిస్థితులకు కారణమేమో!" అన్నాడు మట్టు.

శాస్త్రిగారు రామజోగివైపు చూశారు.

రామజోగి చిన్నగా నవ్వాడు తప్ప ఏమీ మాట్లాడలేదు.

"గురువుగారూ.. మీరు మౌనంగా ఉన్నారేమీ?" అడిగాడు శృంగి.

"ఒక సమావేశం జరగటానికి ఎన్ని కారణాలు వున్నాయొ, ఓ సంఘటన జరగడానికీ అన్ని కారణాలూ వుంటాయి. తక్షపురం వెళ్ళాలన్నది నీ కోరిక మాత్రమే శృంగీ. ఓ బలమైన కారణం ఆ కోరిక వెనకలేదు. అదీగాక, తక్షపుర రహస్యం దానంతట అది బయటపడాలి." అన్నాడు రామజోగి.

"అంటే?" అన్నారు డాక్టర్ టి.వి.ఎన్.

"ఒక్కొక్క సమయానికీ ఒక్కొక్క ప్రత్యేకత వుంటుంది. ఏభై, అరవై పోనీ, డెబ్బై ఏళ్ళ క్రితం షిరిడీ అంటే ఎవరికి తెలుసూ? శబరిమలై ఎవరికి తెలుసూ, కేరళవాసులకి తప్ప. ఇవ్వాళ పుణ్యక్షేత్రాలు ప్రపంచానికంతటికీ తెలుసు. అయ్యా ఓ శివలింగం యుగయుగాలనించీ ఓ నది కింద ఉన్నది. అది జీవనది. నిరంతరం జలం ప్రవహించే నది. ఓ సంవత్సరం ఆ నది పూర్తిగా ఎండిపోయింది. ఇసుక తవ్వుకుపోయేవాళ్ళు ఇసుకని భారీ మొత్తంతో తవ్వుతూంటే, ఓ పుణ్య పురుషుడికి ఆ శివలింగం దొరికింది. పుణ్య పురుషుడు అని ఎందుకన్నానంటే, అతను కూలీనే. కానీ అతని మనసు చక్రవర్తి మనసులాంటివి. తినబోయే ఆహారాన్నైనా ఆకలిగొన్నవారికి ఇచ్చేసే దొడ్డ మనసు అతడిది. ఆ లింగాన్ని అతను ఒంటరిగా మోసుకెళ్ళి ఓ కొండ దగ్గరి గుట్టమీద పెట్టాడు. అతని జీవితమంతా ఆ శివలింగానికి నీటితో అభిషేకిస్తూ నిరంతర శివపంచాక్షరిని ఆలపిస్తూ ఉండేవాడు. ఆలపించడం అని ఎందుకన్నానంటే, అతనికి తోచిన రాగంతో రకరకాలుగా అలపించేవాడు. ఆయన గతించిన పదేళ్ళకి ఆ శివలింగం ఎంత ప్రాచుర్యమైనదంటే, యోగ లింగేశ్వరునిగా ప్రసిద్ధి పొందింది. మధ్యప్రదేశ్‌లోని యోగలింగేశ్వరాలయం వేలాది భక్తుల్ని ఆకర్షిస్తోంది.

కొన్ని వందల సంవత్సరాలు జలంలో వున్న లింగం ఇప్పుడు కొన్ని లక్షల మందికి ఆరాధ్య దైవంగా ఎలా పరిణమించిందీ? మీకు అర్ధమయివుంటుంది. ప్రాణప్రతిష్ట జరిగిన ఆలయాల ప్రాముఖ్యత ప్రాణప్రతిష్ట జరిగిన ముహూర్తం మీద ఆధారపడివుంటుంది. కొన్ని క్షేత్రాలకి ప్రాణప్రతిష్ట అనేది జరగదు. ఎందుకంటే అవి సజీవశిల్పాలు.

అలాగే, తక్షపురంలోని శిలా సర్పం ఓ సజీవశిల. ఎప్పుడు ఎవర్ని రప్పించుకోవాలో అదే రప్పించుకుంటుంది" సుదీర్ఘ ఉపన్యాసం ముగించాడు రామజోగి.

"మానవ ప్రయత్నం అక్కరలేదంటారా? నూనె ప్రమిద వత్తి అగ్గిపెట్టె సిద్ధంగా వున్నా మానవ ప్రయత్నంలేకుండా దీపం తనంతట తాను వెలగదుగా?" ప్రశ్నించారు డాక్టర్ టి.వి.ఎన్.

"ఇవి సామాన్య విషయాలు వంట చెయ్యడం రోజువారీ పనులు నిర్వర్తించడం ఇవన్నీ మనిషి అలవాటుగా చేసుకుని పోయే పనులు. కానీ డాక్టరుగారూ, ఒక ప్రత్యేకమయిన చోటుకి వెళ్ళాలంటే, ఆ చోటు మనని అనుమతించాలి. ఆ చోటు ఎప్పుడు అనుమతిస్తుందీ? ఆ చోటుకీ మనకీ ఏదో సంబంధం ఉన్నప్పుడు మాత్రమే, అదీ ఆ సమయంలో మాత్రమే అనుమతిస్తుంది. ఇది వినడానికి  హాస్యాస్పదంగానే  వుండొచ్చు. మేము ఎనిమిదిమది అన్నదమ్ములం. అందరూ తలా చోటూ వున్నాము. ఒకరు అమెరికా అయితే మరొకరు ఇంగ్లాండు. ఒకరు బీహార్‌లో వుంటే మరొకరు తమిళనాడులో. ఒకరు ఢిల్లీలో ఉంటే ఇంకొకరు కలకత్తాలో, మరొకరు పూనాలో వున్నారు. నాతో సహా ఎవ్వరూ మా జన్మస్థలంలో లేరు. అక్కడ మా నాన్న అమ్మ ప్రేమతో కట్టిన ఇంట్లో ఎవరో అద్దెకి వుంటున్నారు. ఆ అద్దె పేరుకేగానీ వారిచ్చినదీ లేదు, మేం పుచ్చుకున్నదీలేదు. అయ్యా.. మరో విషయం" ఆగారు శాస్త్రిగారు.

"చెప్పండి చెప్పండి" కుతూహలంగా అడిగారు డాక్టర్ టి.వి.ఎన్.

"మిగతా వారంతా ఎవరిది వారిని వారు వెళ్ళిపోతే, మేం మాత్రమే ఇక్కడికి ఎందుకొచ్చాం. ఎందుకు మీ ఇంట్లో భోంచేశాం. కారణం చెప్పగలరా? మీరు పిలిచారు గనక అని చెప్పొచ్చు. మీరు పిలిచాక, రావాలనే సంకల్పం మా మన్సుల్లో కలగాలిగా? అది కలిగించింది ఎవరు? ఇలా ప్రశ్నలు వేసుకుంటూ పోతుంటే, ప్రశ్నలకు అంతుండదు. నిజం ఏమంటే ఎందుకొచ్చినా మీ తోటలోకి మేం వచ్చాం. అది సత్యం" అన్నారు శాస్త్రిగారు.

"అది నిజమేనయ్యా. మీరెవరో మాకు, ముఖ్యంగా నాకు తెలీకపోయినా మీరు పెట్టిన ప్రసాదం తిన్నాను. ఇది ఏ జన్మ రుణమో" చేతులు జోడించి అన్నాడు మట్టూ. ఓ క్షణం నిశబ్దం నాట్యమాడింది. ఎవరి ఆలోచనలు వారివిగా సమయం గడుస్తోంది.

"కొంచెం కాఫీ, కాసిని పకోడీలు" నవ్వుతూ ఓ ట్రేలో పకోడీ ప్లేట్లతో టీ గ్లాసులు తీసుకొస్తూ అన్నది విమల సుందరి.

"శాస్త్రిగారూ... ఉల్లిపాయలు వేయలేదు. అరటి, పచ్చిమిర్చి కొత్తిమీరలాంటి వాటితో చేశాను" చెప్పారు విమల సుందరి.

"హ...హ.. ధన్యవాదాలు అమ్మా.." తలో ప్లేటూ, కప్పూ తీసుకున్నారు. పకోడీలు నములుతూ, మధ్య మధ్య టీ తాగుతూ "అద్భుతంగా ఉన్నాయి" రుచి ఆస్వాదిస్తూ అన్నాడు శృంగి. మట్టూ చక్కగా తింటున్నాడు. రామజోగి మాత్రం టీ తీసుకున్నాడు. పకోడీలు శృంగివైపుకి జరిపాడు. విమల సుందరి చూసినా ఏమీ అనలేదు.

"ఏళుమలై.. ఇన్నాళ్ళపాటు శ్రీనివాస్‌తో వున్నావు. మొదట్లో రాబీ గారితో వున్నావు. నీకు ఏమనిపించింది?" అడిగాడు జయ్. వాళ్ళు చెన్నైకి తిరిగొచ్చిన మరుసటి రోజునే వేరేకారు తీసుకుని రాబీ తిరువణ్ణామలైకి వెళ్ళిపోయాడు. ఆ రోజు ఏళుమలై దొరకలేదు.

రాబీ వెళ్ళిపోయిన మూడో రోజున జయ్‌కి ఏళుమలై దొరికాడు. ఇద్దరూ 'శాంతి భవన్'లో కూర్చున్నారు.

"నిజంగా చెబితే ఆ నెలలు నా జీవితంలో అత్యంత ఘోరమైనవి సార్. ఒక్కోసారి నేను నేనేనా? అనిపించేది. ఏదో మాట్లాడాలనుకుని మరేదో మాట్లాడేవాడిని. ఎంత ఆలోచించినా నేనేం మాట్లాడానో గుర్తుకొచ్చేదికాదు. నా శరీరంలోకి మరెవరో దూరి వారి పనులు చేసుకున్నట్టు అనిపించేదిగానీ, అది నా శరీరం అనిపించేదికాదు. వింధ్య పర్వతాలనించి చాలాసార్లు కారు తీసుకుని పారిపోయి చెన్నై వచ్చెయ్యాలనిపించేది. ఆ సమయంలో నన్ను ఓ మగత కమ్ముకునేది. ఎవరో తెల్లని వ్యక్తి కనిపించేవాడు. అదో కలలాగా వుండేది. ఓ రోజున ఆ తెల్ల మనిషే చెప్పాడు, "వీరిద్దర్నీ తీసుకుపోయి తిరుపతిలో వదిలిపెట్టు. నీకు చాలా చాలా మేలు జరుగుతుందని" ఆగాడు ఏళుమలై.

"జరిగిందా? నువు తీసుకొచ్చింది శ్రీనివాస్, శరద్వతులనేగా?" అడిగాడు జయ్.

"అవునండీ.. వాళ్ళనే. వచ్చిన మూడోరోజున మా ఓనరుగారు పిలిచి కంపెనీలో నలభై పర్సెంటు వాటా ఇచ్చారండి. అదేమని ఆశ్చర్యపడితే, 'నాకెలాగూ పిల్లల్లేరు. పేరుకి నేను ఓనర్‌నయినా నువ్వే నడుపు. 60% నాకు ఇవ్వు. నేను గనక చనిపోతే నా భార్య బతికున్నంతకాలం 50% ఇచ్చి ఆ తరవాత కంపెనీని పూర్తిగా నువ్వే స్వాధీనం చేసుకో అని వ్రాతపూర్వక ఒప్పందంతో రాసి మరీ రిజిస్టరు చేసి ఇచ్చారండి. జీవితంలో ఇటువంటిది జరుగుతుందని ఊహలో కూడా నాకు రాలేదండి" సిన్సియర్‌గా అన్నాడు ఏళుమలై.

అవాక్కయ్యాడు జయ్.

"మూడురోజుల క్రితం మీరు మా ఆఫీసుకి ఫోన్ చేసినప్పుడు నేను మా ఓనరుగారూ శ్రీశైలానికి వెళ్ళామండి. అందుకే రాలేకపోయాను. తిరిగివచ్చినప్పుడే మా వాళ్ళు చెప్పారు. మీరు నా గురించి అడిగారనీ, నేను లేనుగనక మరొకర్ని కారుతో పంపామనీ" అన్నాడు ఏళుమలై.

"ఆ తెల్లని మనిషిని మళ్ళీ చూస్తే గుర్తుపట్టగలవా?" అడిగాడు జయ్.

పకపకా నవ్వాడు ఏళుమలై. "అయ్యా ఆయన్ని చూసింది కలలోనండి. కలలోవాళ్ళు నిజంగా కంటికి కనిపిస్తారాండీ? ఆయన రూపం బాగా గుర్తుంది. ఆజానుబాహువు. ఆయన ఇంగ్లీషు ఇంగ్లాండు వారు మాట్లాడే ఇంగ్లీషులా ఉందండి."

"అది ఇంగ్లాండు ఇంగ్లీషని నీకెలా తెలుసు?"

"అమెరికన్లు యాస వేరండి. ఇంగ్లీషోళ్ళ యాస వేరండి. చెన్నైలో ఏ డ్రైవరు కన్నా ఆ తేడా తెలుస్తుందండీ. అయితే ఆ డ్రైవరు నాలాగే చెన్నైలో పుట్టి పెరిగితే మాత్రమే తెలుస్తుందండి" నవ్వి అన్నాడు ఏళుమలై.

"మరోసారి నేను ఫోన్ చేస్తే.." అని జయ్ అంటుండగానే,

"ఎందుకురానండీ. మీరు పిలవబట్టేగదమండీ నాకింత అదృష్టం పట్టిందీ" ఆనందంగా అన్నాడు ఏళుమలై. ఇద్దరూ లేచారు... సర్వర్‌కి బిల్ జయ్ చెల్లించాక.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

(Post your comments)